# కెటుకు

**-పాలెపు బుచ్చిరాజు**

విశాఖపట్నంలో గవర్నమెంటు డాక్టరుగా సెంట్రల్ జైలులో ఖైదీల ఆరోగ్య పరిస్థితిని తనిఖీ చేయడం, తగుమాత్రం సూచనలిచ్చి, మందులివ్వడం కూడా నా విధుల్లో ఒకటి. జైలు అనగానే నేరాలూ, నేరస్థులు, ఖూనీలు, ముద్దాయిలు, నిందితులు ఉండడం సహజమే గదా! అటువంటి కేసుల్లో రాజకీయాల ప్రాముఖ్యాన్ని కూడా వేరే వివరించనక్కర్లేదు.

ఈమధ్యనే ఒక నిందితుడి మీద సరైన సాక్ష్యాధారాలు లేకుండా, హత్య కేసు బనాయించమని నా మీద చాలా వత్తిడి వచ్చింది. కానీ నేను లొంగ లేదు. పైగా నిందితుడు చాలా నీరసంగా ఉన్నాడనీ, అతనికి సరైన ఆహారం ఇవ్వవలసిందనీ అధికారులకి సిఫారసు చేశాను. నిప్పు మీద అడుగేస్తున్నా వన్న సహోద్యోగుల హెచ్చరికని పెడచెవిన పెట్టాను.

అదుగో, దాని ఫలితమే, ఈ నా ట్రాన్సఫరు ఆర్డరు. విశాఖపట్నం జిల్లాలో ఒక మారుమూల కుగ్రామానికి బదిలీ చేశారు. వెళ్లక తప్పదు. కాళ్లా వేళ్లాబడి బ్రతిమిలాడుకోవడం నాకు రాదు. బయ ల్దేరాను.

ఆ ఊరి పేరు గమపూడి. అందరూ మోతుబ రులు, ఘరానా మనుషులు ఉండే ఊరు. ఆ కండు వారాయుళ్లకి తరతరాల తామసప్రవృత్తి వార సత్వం. అదే రాజసం అని మీసాలు దువ్వుతారు. ఆత్మాభిమానానికి, మాటనిలకడకీ, ప్రతీకారానికీ రాజపుత్రుల్ని మించిన వారు. ఏమాత్రం తేడా వచ్చినా తల తీసేయడానికి వెనుకాడరు.

బయల్దేరుతూండగా శ్రేయోభిలాషులు చెప్పిన హితవాక్యాలు మననం చేసుకుంటూ, స్కూటరు నడిపిస్తున్నాను.

ఉదయం తొమ్మిది గంటలయింది. ఎండా కాలం. దారిలో ఒక ఏరు దాటవలసి వచ్చింది. ఏటిలో నీటికంటే ఇసుకమేటలే ఎక్కువగా ఉన్నాయి. నీరు పల్లంగా ఉన్న వైపుగా ప్రవహి స్తోంది. ఆవలి ఒడ్డున ఒక ప్రక్కగా కొందరు ఆడ వాళ్లు చెలమల్లో నీళ్లు చేదుతున్నారు. ఓ కుర్రాడు బాణాకర్ర భుజాలమీద ఆనించి అక్కడ నిలబడి ఉన్నాడు.

నేను అటూఇటూ చూస్తూంటే, "ఏటలా సూత్త న్నావు?" అని గదమాయించాడు. పిట్ట చిన్నద యినా కూత ఘనంగానే ఉంది.

"నదిలో ఎక్కడ లోతుగా ఉందో చూస్తు న్నాను. దీన్ని తోసుకుపోవాలి గదా" అన్నాను నా స్కూటర్ని చూపిస్తూ.

"ఆ సూత్రం దానికేనా? నన్నడిగితే పోదూ? అదుగో ఈ ప్రక్కగా వెళ్లు!" అన్నాడు.

చచ్చీ చెడి, స్కూటర్ని ఏరు దాటించి గమ పూడి చేరుకున్నాను. ఊరంతా ధూళీ దూసరానూ. ఎత్తుగోడల ఇళ్లు.

కొంత దూరం వెళ్లాక కొంచెం విశాలమైన స్థలం కనిపించింది. అక్కడొక మర్రిచెట్టు కింద పెద్ద బండరాళ్ల మీద కొందరు యువకులు కూర్చుని ఉన్నారు.

అది రచ్చబండ కాబోలు అనుకున్నాను. వారికి ఎదురుగా నేను స్కూటరు మీద ప్రయాణించడం వారికి అంతగా నచ్చలేదనుకుంటాను. వారిలో ఒకడు నన్ను చేయెత్తి పిలిచాడు.

"ఏ ఊరు?"

ప్రశ్నలో అధికారదర్పం ఉంది కానీ గౌరవ భావం లేదు.

"విశాఖపట్నం నుంచి వస్తున్నాను. డాక్టర్ని. ఈ ఊరి హెల్త్ సెంటరులో వేశారు."

"రాయుళ్ల ఊర్లో మొదటిసారి కాలు పెట్టినట్టు న్నావు."

"అవును. నేనెప్పుడూ అటు రాలేదు."

"నీ వేషభాషలూ, ప్రవర్తనా చూస్తే తెలుస్తూనే ఉంది. రచ్చబండ మీద పెద్దలుండగా వాహనం దిగాలని తెలియదా నీకు? ముందు బండి దిగు. రాయుళ్లని గౌరవించడం నేర్చుకో?"

నేను మాట్లాడకుండా స్కూటరు దిగి, ఈడ్చు కుంటూ పదడుగులు వెళ్లాను. ఆ తరువాత తెలి సింది నాకు, ఇది చాలా పురాతనమైన రివాజు అని. ఆ రోజుల్లో కార్లూ, స్కూటర్లూ ఎక్కడివి? ఎడ్ల బండి మీదనో, గుర్రపు బగ్గీలోనో ప్రయాణాలు. ఎంతటివారయినా సరే, రచ్చబండ వద్ద బండి దిగి పడవలసిందే.

కొంచెం ముందుకెళ్లి వాకబు చేస్తే, ప్రభుత్వాసు పత్రి హైస్కూలు ఆవరణలోనే ఓ ప్రక్కగా ఉందని తెలిసింది. తిన్నగా అక్కడికి చేరుకున్నాను. నేనొస్తు న్నానని తెలిసి, బంట్రోతు అప్పటికే అక్కడికి చేరు కున్నాడు.

కానీ పరిసరాలు తుడిచి శుభ్రం చేసిన ఆనవా లేమీ లేదు. కుర్చీ, టేబిలు, కిటికీలు, తలుపులు, మందుసీసాలు, మాత్రల డబ్బాలు అన్నీ మట్టికొ ట్టుకుని పోయి ఉన్నాయి. గదంతా అంగుళం ఎత్తున దుమ్ము పేరుకుపోయి ఉంది. నాకేం పాలు పోలేదు.

"నీ పేరేంటి?" ఆ బంట్రోతుని ప్రశ్నించాను.

"ఎంకిరాయుడు. కానీ సారూ! ఒక చిన్న వినతి. నేను నౌకరునే కావచ్చు. కూటికి పేదను కానీ కులానికి పేదను కాను. రాయుళ్ల అబ్బాయిని. దయచేసి ఏకవచన ప్రయోగం చేయకండి. గౌరవం ఇచ్చి పుచ్చుకోండి." అన్నాడు.

వాడినొక ఊపు ఊపుదామనిపించింది. కానీ మిత్రుల సలహాలు నన్ను వారించాయి. జేబు లోంచి రుమాలు తీసి, కుర్చీమీది దుమ్ము దులుపు కుని, కూర్చున్నాను.

అంతలో గుమ్మం దగ్గర ఒక ఏభయ్యేళ్ల వ్యక్తి ప్రత్యక్షమయ్యాడు.

"చెప్పండి. ఏమిటిలా వచ్చారు?" వివేకం వెన్ను చరచగా అడిగాను.


"మందు కోసం. విరేచనాలవుతున్నాయి.'

"పేరు?" కేసు పేపరు రాయబోతూ అడిగాను.

"బుచ్చితల్లి. వయసు పదేళ్లు. తండ్రి పేరు కావాలంటే రాసుకో. గున్నరాయుడు. నా పేరే

అది.''

"కానీ బుచ్చితల్లి, రోగి ఎక్కడుంది? పేషంటుని చూడకుండా మందులి వ్వడం రూల్సుకి వ్యతిరేకం.''



"నువ్వు నీ రూల్స్ పక్కన పెట్టు. రాయుడి కూతురు ఇంటిగుమ్మం దాటి వచ్చి, పరాయి వాడికి మొహం చూపిస్తుందా? మారు మాట్లాడకుండా మందియ్యి. అదీ ఒక్క రోజుకి కాదు. నాలుగు రోజులకి సరిపడా'' గున్నరాయుడి చేయి మీసాల మీదికి మళ్లింది.

నిశ్శబ్దంగా నేనిచ్చిన మందులు అందుకుని, మళ్లీ అలా అన్నాడాయన. "రెండో కేసు లచ్చుమమ్మది. దానికి రెండేళ్లు. జలుబూ దగ్గూను. మూడోది చిన్నరాయుడిది. పన్నెండేళ్ల వాడు. రెండ్రోజుల నుంచీ జొరం. నాలుగో వాడు కన్నంరాయుడు... ... ...'' ఆ పెద్ద మనిషి ఏడేడు మందికి మందులు రాయించాడు.

ఒక్కరు కూడా ప్రత్యక్షంగా హాజరు కాలేదు. అంటే దొంగ రేషను కార్డుల బాపతు అన్న మాట.


మొత్తంమీద రెండు మూడు వందల దాకా మాత్రలు తీసికెళ్లాడు.

అతను వెళ్లాక, నేను బంట్రోతును అడిగాను.

"ఈ పిల్లలు, మందులు అదంతా నిజమేనా?'' అని.

"పిల్లల వరకూ నిజమే. జబ్బులే దొంగ జబ్బులు. అంతా అబద్ధం. కానీ ఆయన మాత్రం ఏం చేస్తాడు? అక్కడికి డాక్టర్లయితే వస్తారు. కానీ ఒక్కరూ నాలుగు రోజుల పాటు ఉండరు. రిజిస్టరులో సంతకాలు చేసి, జీతాలు తీసుకోవడానికి వస్తారు. సర్పంచి వద్ద సర్టిఫికేటు తీసుకుని పోతారు. అటువంటి పరిస్థితుల్లో గున్నరాయుడి వంటి వాళ్లు ఆరు నెలలకు సరిపడా మందులు ఒక్కసారి పోగుచేసుకుంటారు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి గదా.''

అదీ నిజమే. నేనూ పర్మినెంటుగా అక్కడుండిపోవడానికి రాలేదు. ప్రభుత్వం నన్ను ఇక్కడ పోస్ట్ అయితే చేసింది, కానీ తిండికీ, ఉండడానికీ సదుపాయాలేవీ? అదీ అలాంటి తల బిరుసు మనుషుల మధ్య నెల రోజుల పాటు



ఇలా గడపడం కష్టం. ఈవేళ నాకీ ఊళ్లో మొదటి రోజు, కాబట్టి, సర్పంచ్‌గారి దర్శనం కూడా చేసుకోవాలి. హాజరు వేయించుకోవాలి గదా.

'సర్పంచితో మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండండి' బంట్రోతు హెచ్చరిక.

"అతని పేరే నాగురాయుడు. సర్పానికేమాత్రం తీసిపోడు. చాలా బ్రతి రుగుడు మనిషి. అరవై సంవత్సరాల వయసులో, సుమారు అరడజను వరకూ హత్యలు చేసి ఉండవచ్చు. ఈమధ్యనే అతని కొడుకు హత్యానేరంలో ఇరుక్కుని, విశాఖపట్నం సెంట్రల్ జైలులో ఉన్నాడు."

"ఆ కొడుకు పేరేంటి?"

"బుల్లి రాయుడు."

"నాకు తెలియకడుగుతాను. ఈ ఊళ్లో అందరూ రాయుళ్లేనా? మీరెవరూ లేరా?"

"రాయుళ్ల ఊళ్లో కాపరం చేయడానికి ఏ తల్లి కడుపున పుట్టి ఉండాలి? ఉన్న రెండు వందల ఇళ్లూ రాయుళ్లవే!"

నేను షాకు తిన్నాను.

***

సాయంత్రానికల్లా దుకాణం కట్టిపెట్టి రాయుళ్లరాయుడు, మహారాజా వాగు రాయుడి దర్శనానికి వెళ్లాను.

సింహద్వారం తెరిచే ఉంది. లోపలికి తొంగిచూసి నేను స్థబ్ధుడునయ్యాను.

చాలా విశాలమైన ఆవరణ. దూరంగా, నాలుగు పక్కలా పంచలు దించిన పెంకుటిల్లు.

ఒకప్రక్క పశువుల కొట్టాం. పెద్ద పర్వతాల్లాంటి గడ్డిమేట్లు. నాలుగైదు ఆవులు, దూడలు వాటి మీద దాడి చేస్తున్నాయి. ఇంటి ముందుప్రక్క వరండాలో కచ్చేరి సావిడి.

అక్కడ రెండు మూడు కుర్చీలు, బెంచీలు. అదే సర్పంచిగారి దర్బారు అన్నమాట.

ఇంటి ఆవరణ అంతా నిశ్శబ్దంగానూ, ఏదో విషాదం ఆవరించినట్లూ ఉంది.

అవును. ఆ ఇంటి పెద్ద కొడుకు జైలులో ఉన్నాడు. నేను క్షణం పాటు సందిగ్ధంలో పడ్డాను. ఎట్టకేలకు ధైర్యం చేసి, తెరిచే ఉన్న తలుపు గొళ్లెం తట్టి, నా రాకని తెలియజేశాను. లోపల్నుంచి ఒక వయసు మళ్లినాయన బయటికి వచ్చాడు.

బొబ్బిలి రాజా వేషం. చింతనిప్పుల్లాంటి కళ్లు. నెరిసిన మీసాలు, నోట్లో వెటర్నరీ సిరంజి అంత చుట్ట. గంభీరమైన గొంతు.

"డాక్టరులా ఉన్నావు. రా! కూచో!" అంటూ, కచ్చేరీలోకి దారి తీశాడు. అక్కడ పులితోలుతో అలంకరించిన, వాలుకుర్చీలో కూర్చుని, వెనకాలే వెళ్లిన నాకు ఓ బెంచీ బల్ల చూపించాడు.

నేను వినమ్రంగా ఆయనకి నమస్కారం పెట్టి, కూర్చున్నాను.

"హాజరీ కోసం వచ్చావు. అవునా?"

"అవునండీ."

"అంటే మళ్లీ నెల రోజుల పాటు గైరుహాజరన్నమాట. నా రాజ్యం అలాంటిదేం చెల్లదు సుమా! రోజూ ఆసుపత్రి తెరవవలసిందే. నీ మీద ఏ కంప్లయింటన్నా వచ్చిందో, చూసుకో! అర్థం అయిందా? కుర్రాడిని కనక చెప్తున్నాను. ఈ ఊళ్లో హెచ్చరిక ఒకసారే చేయబడుతుంది."

"అర్థం అయిందండి."

"ఏం తాగుతావు? టీనా? కాఫీయా?

"టీ చాలు."


సర్పంచి కూర్చునే గుమ్మంలోకి సాభిప్రాయంగా చూశాడు. చిరుమువ్వల సవ్వడి గుమ్మం వరకూ వచ్చి ఆగిపోయింది.

"అమ్మా రెండు కప్పులు టీ చెయ్యి." అది ఆదేశం. అయినా అందులో కర్కశత్వానికి బదులు, తియ్యదనం ఉంది. ప్రేమా వాత్సల్యమూ ఉన్నాయి. జైలులో ఉన్న కొడుకు భార్య మీది మనోభావానికి ప్రకటన అది. మువ్వల చప్పుడు దూరమయింది. పది నిమిషాల పాటు మా మధ్య పిచ్చాపాటీ నడిచింది.

ఆ మువ్వల చప్పుడు మళ్లీ సమీపించడం గమనించాయి నా చెవులు. గుమ్మం దాటకుండానే టీ కప్పులు నేల మీద పెట్టిన చప్పుడు. మువ్వలు దూరం అయ్యాయి.


సర్పంచి రాయుడు ఆ కప్పులందుకుని, ఒకటి నాకిచ్చి, రెండోది తాను తీసుకున్నాడు.

"అక్కడికి వచ్చే ముందు ఎక్కడ పనిచేశావు?" టీ పూర్తయ్యే వరకూ



## గడసరి దీపిక

దీపికా పదుకొనే తన తొలిచిత్రం 'ఓం శాంతి ఓం' విడుదలకు ముందు నుంచీ వార్తల్లో వ్యక్తి అవుతోంది. మొదటి సినిమాలోనే షారుఖ్‌కి జోడీగా నటిస్తున్న ఈ ముద్దుగుమ్మ ధోనీ, యువరాజ్‌ల చుట్టూ తిరుగుతూ పబ్లిసిటీ సంపాదిస్తోంది. అయితే తనకి వాళ్లతో ఎలాంటి పర్సనల్ అనుబంధాలు లేవని కొట్టిపారేస్తున్న దీపిక తనకి క్రికెట్ అంటే వున్న వల్లమాలిన అభిమానం వల్లనే తను వాళ్లకి దోస్తునయ్యానంటోంది. ఏదేమైనా సినిమా తారగా బాగా రాణించగలదు దీపిక- అని సినీజనాలు అంచనాలు వేస్తున్నారు.



సంభాషణ కొనసాగించడానికి వేసిన చొప్పదండు ప్రశ్న అది. కానీ రాయుడికేం తెలుసు ఈ కుర్ర డాక్టరు అంతసేపూ, ఈ ప్రశ్న కోసమే ఎదురుచూస్తున్నాడని?

"విశాఖపట్నం సెంట్రలు జైలులో డాక్టరుగా ఉండేవాడిని" ఒక్కొక్క మాటా నొక్కి పలుకుతూ అన్నాను.

"విశాఖపట్నంలోనా? సెంట్రలు జైలులోనా? డాక్టరుగారా?" సర్పంచి కళ్లలో విద్యుల్లతలు, టీ కప్పు ఎక్కడిదక్కడే ఉంది.

"అవును సర్పంచిగారూ! జైలులోనే పనిచేశాను. అక్కడ మీ అబ్బాయికి చికిత్స కూడా చేశాను" ఓ బాంబు విసిరాను.

"చికిత్స చేశారా? మా అబ్బాయికా? ఏమయింది వాడికి?" అతని గొంతు బొంగురుపోయింది. ఆతురతతో అడిగాడు.

"భయపడకండి. జబ్బేమీ కాదు. అతనక్కడ కష్టమైన పనులు చేయలేకపోయేవాడు. అందుకని తేలిక పనులు చెప్పమని జైలు అధికారులకి సిఫారసు చేశాను. అతనికి జైలు భోజనం సరిపడేది కాదు. ఉదయం సాయంత్రం పాలు ఇప్పించమని ప్రాధేయపడ్డాడు."

"నిజమే నాయనా! వాడు అప్పుడు పిండిన గేదెపాలు తాగేవాడు. రాత్రి పాలు తాగకపోతే అసలు నిద్ర పట్టదు వాడికి. మరి నువ్వు... ..."

"బాధ పడకండి సర్పంచిగారూ! నేనతనికి రోజుకి రెండుసార్లు అదనంగా పాలు ఇవ్వాలని రికమెండు చేశాను. అంతేకాక, నా తరువాత వచ్చే డాక్టరుకి కూడా ఈ ఏర్పాటు గురించి చెప్పాను."

మందు పని చేసింది.

సర్పంచి లేచి నిలబడ్డాడు. కప్పులో టీ చప్పగా చల్లారిపోయింది. అయినా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. తలవంచి నా కాళ్లకి మొక్కబోయాడు. నేనాయన్ని వారించాను.

" వద్దు! వద్దు! సర్పంచిగారూ! వయసులోనూ, హోదాలోనూ కూడా మీకంటే చిన్నవాడిని. మీకిది తగదు."

ఆయన ఇంకేమీ మాట్లాడలేకపోయాడు. నా శిరసు మీద చేయుంచి, కొంతసేపు అలాగే ఉండిపోయాడు.

ఇంతలో ఏమనిపించిందో లోపలున్న కోడలుపిల్లని పిలిచాడు. ఆ వచ్చినామెతో, ఆప్యాయంగా ఇలా అన్నాడు.

"ఇటు రా! అమ్మా! సిగ్గుపడకు. నేను రమ్మంటున్నాను గదా! సందేహించకు. ఇదిగో! ఈ అబ్బాయి ఉన్నాడే, ఈయన ఒక డాక్టరు. విశాఖపట్నంలో మీ ఆయనకి ఎంతో సహాయం చేశాడు. అందుకు మనమెంతో రుణపడి ఉన్నాము. మనవాళ్ల ముందు ముసుగెందుకు నీకు? ఈయన కాళ్లకి వందనం చేయి" ముసలాయన చెప్పుకుపోతున్నాడు.

ఆ అసూర్యంపశ్య ముసుగు తొలగించి నా వంక కృతజ్ఞతా పూర్వకంగా చూసింది.

క్షణకాలం నేనా ముగ్ధమోహన రూపాన్ని తిలకిస్తూ ఉండిపోయాడు. కానీ పతివియోగంతో శాంతి దక్కి ఉంది.

పెద్దాయన చెప్పుకుపోతూనే ఉన్నాడు.

"ఎన్నో ఖూనీలు చేశాను బాబూ ఈ చేతుల్తో! కానీ, ఎప్పుడూ పట్టుబడలేదు. నా కొడుకు మాత్రం నిర్దోషి అయి ఉండీ కూడా పట్టుబడిపోయాడు. మేము దుర్మార్గులుగా పేరుపడిపోయాము. కాబట్టి కేసు ఓడిపోయాం. పగ తీర్చుకోవాలంటే, మరో మూడు నాలుగు ఖూనీలు చేయడం నాకు పెద్ద పని గాదు. కానీ నువ్వు మాకు చేసిన ఉపకారం మాత్రం ఈ జన్మలో మరిచిపోను. చెప్పు! ప్రత్యుపకారంగా నీకు నేనేమీ సహాయం చేయగలను?"

"మరేమీ వద్దు. నాకు మళ్లీ బదిలీ అయ్యేవరకూ, మీ ఊళ్లో గడపాలి. అందుకు.... "

"సరే! దానికేం భాగ్యం! రేపటి నుంచీ ఆసుపత్రి బంద్. నువ్విక్కడికి రానక్కరలేదు. సర్టిఫికెటు నేనే నీకందేలా పంపుతారు."

"అంతగా అక్కరలేదు. వారానికి నాలుగు రోజులు వచ్చి సేవలు చేస్తాను. దారిలో మీ ఊరి యువకులు నన్ను బాధించకుండా ఉంటే చాలు" అని నా అనుభవాన్ని చెప్పాను.

ఆయన పగలబడి నవ్వి, "అంతేనా? ఈ మాత్రం అల్లరి మా ఊళ్లలో మామూలే. ఈ రోజు నుంచీ నువ్వెవరికీ భయపడక్కరలేదు. ఎవరయినా నిన్నడ్డుకుంటే, నా పేరు చెప్పు. వినకపోతే, నాలుగు పీకి, నాగురాయుడితో చెప్పుకోమను" అని ఆర్డరు జారీ చేశాడు.


నా మనసు తేలిక పడింది. ఇహ నేను ఎక్కడా స్కూటరు దిగి నడిపించనక్కరలేదు.

అది రచ్చబండ అయినా సరే! రాజకుమారులయినా సరే! ఆఖరికి, నదీ జలం అయినా సరే, నారీ జనం అయినా సరే!

★

## నోట్లు ఢోంచేసిన మేక

జర్మనీలో రోజన్‌హామ్‌లో మార్టిన్‌రాడ్ బెర్నర్ అనే రైతు 100 రూపాయల నోట్ల కట్టని కిచెన్‌లో బల్లమీద పెట్టి ఫోనొస్తే వెళ్లాడట. ఐదు నిముషాల్లో అతను తిరిగి వచ్చి చూసేసరికి కిచెన్‌డోర్ తెరుచుకుని లోపలకు



దూరిన మేక ఆ నోట్లకట్టని తింటూ కనిపించిందిట. పదివేల యూరోలు మేక కడుపులోకి వెళ్లిపోవడం చూసి అదిరిపోయిన మార్టిన్ దాన్ని వెటర్నరీ డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్లాడుట. ఆ డాక్టర్ దాని పొట్టకోసి ఆ నోట్లకట్టని బయటకు తీసి భద్రంగా అతనికి అప్పగించాడట.

-తటవర్తి

